పట్టుకోండి చూద్దాం!

- గుడిరేవు గోదావరి నదిలో యథేచ్ఛగా ఇసుక దందా
- ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



గుడిరేవు గోదావరినదిలో ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న దృశ్యం



ఇసుక లోడ్ ట్రాక్టర్ ఇంజిన్ టైర్ల పైకి లేచిన దృశ్యం

దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి నదిలో ఇసుకాసురులు పట్టుకోండి చూద్దాం అనేలా వ్యవహరిస్తున్నారు. యథేచ్ఛగా నదిలోంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా తమకేమి పట్టనట్టుగా వ్యహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నదిలో నీటిమట్టం కొంతమేర తగ్గుముఖం పట్టడంతో ట్రాక్టర్లను నది లోపలిదాక తీసుకెళ్తున్నారు. కూలీలతో ఇసుకను తోడించి ట్రాక్టర్లలో నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. నది తీరం వెంట ఎటుచూసిన ఇసుక ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి.

సర్కస్ ఫీట్ల నడుమ నదిలోంచి బయటకు..

నదిలో ఇసుకను నింపుకున్న ట్రాక్టర్లు బయటకు రావాలంటే సర్కస్ ఫీట్లు పడాల్సిందే. తడి ఇసుకను ట్రాక్టర్లలో నింపుకొని బయటకు వచ్చే క్రమంలో గుంతల్లో ట్రాక్టరు ట్రాలీ దిగబడుతున్నాయి. ఇటీవల బురదలో దిగబడిన ఇసుక ట్రాక్టర్‌ను బయటికి తీసే క్రమంలో ఒకరు మృతువాతపడ్డ సంఘటన గుడిరేవు గోదావరి వద్ద చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అధికారులు దృష్టిసారించి గుడిరేవు గోదావరి నదితీరం నుంచి నిత్యం జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. ఇసుక అక్రమ రవాణాపై తహసీల్దార్ సంధ్యారాణిని ఫోన్‌లో సంప్రదించగా మేము రైతుభరోసా సర్వేలో ఉన్నాం. పోలీసులకు సమాచారం ఇస్తానని చెప్పారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నెన్నెల: ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుండా మోసం చేసిందన్నారు. ఎమ్మెల్యే వినోద్ స్థానికంగా నివాసం ఉండకపోవడంతో ఆయన అనుచరులు మండలానికో ఎమ్మెల్యేగా తయారై అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో రైస్‌మిల్లర్లు రూ.100 కోట్లు స్వాహా చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ధాన్యం స్కాంలో నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో చేస్తున్న కోట్ల రూపాయల అభివృద్ధి పనులన్నీ గత బీఆర్‌ఎస్‌లో మంజూరు చేసినవేనని ఇప్పుడు అవే పనులు చేస్తూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ తాను చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, నాయకులు రాంచందర్, ప్రతాప్‌రెడ్డి, ఎండీ ఇబ్రహీం, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

నెన్నెల: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకులు పూదరి అంజన్న, నరేశ్‌ల తండ్రి పూదరి సత్తన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, నాయకులు సింగతి రాంచందర్, ప్రతాప్‌రెడ్డి, ఎండీ ఇబ్రహీం, పురంశెట్టి తిరుపతి, కొయ్యడ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎంఈవోగా గోపాల్‌రావు



బాధ్యతలు స్వీకరిస్తున్న గోపాల్‌రావు

భీమారం: ఎంఈవోగా గోపాల్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సురేశ్ ఉద్యోగ విరమణ పొందారు. చెన్నూర్ జెడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న గోపాల్‌రావు పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఎంఈవో బాధ్యతలు అనంతరం గోపాల్‌రావు మాట్లాడుతూ మండలంలో విద్యావ్యవస్థని మరింత పటిష్ట పరిచేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: రాష్ట్ర రిటైర్డ్ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ 2025 సంవత్సరం క్యాలెండర్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జలగం నారాయణరావు, జిల్లా అధ్యక్షుడు ఎండీ తహేరొద్దీన్, జనరల్ సెక్రెటరీ ఎం.లింగారెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎండీ మేరాజొద్దీన్, ఆర్గనైజర్ సెక్రెటరీలు ఎం.జనార్దన్, ఎం.ఉద్ధవ్, సభ్యులు లచ్చన్న, బెనర్జీ, విజయ్‌కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ, ఎస్సై

దండేపల్లి: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎంవీఐ కిశోర్‌చంద్రరెడ్డి, దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని మేదరిపేటలో శుక్రవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు వాహన ధ్రువపత్రాలు తమవెంట తెచ్చుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్, ఫోర్ వీలర్ వాహనాదారులు సీటుబెల్టు ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. ఏఎస్సై రాజేందర్, సిబ్బంది రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఏసీసీ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మంచిర్యాల టూటౌన్ ఏఈ కె.శ్రవణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ ఏరియా, ఇక్బాల్ అహ్మద్ నగర్, ఇందిరానగర్, జాఫర్‌నగర్, జన్మభూమినగర్, హైటెక్‌సిటీ, గ్రీన్‌సిటీ, ఏసీసీ ఏరియా, శ్రీనివాసగార్డెన్, సావిత్రినగర్, వికాస్‌నగర్, లక్ష్మీనగర్, గౌతమినగర్, ఇస్లాంపుర, ఆండాళమ్మ కాలనీ, రాళ్లపేట్, డీసీపీ ఆఫీస్ ఏరియాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

కోటపల్లి: మండలంలోని బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పార్‌పల్లి నుంచి మండలకేంద్రం వరకు రోడ్డు సౌకర్యం కల్పించి బస్సు నడిచేలా చూడాలని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లిన స్పందించకపోవడంతో పాదయాత్రకు పార్టీ మండల అధ్యక్షుడు రామయ్య పిలుపునివ్వగా పోలీసుల నుంచి అనుమతి లేకపోవడంతో శుక్రవారం ముందస్తుగా నాయకులను అదుపులో తీసుకున్నారు. మండల అధ్యక్షుడు రామయ్య మాట్లాడుతూ పార్‌పల్లి నుంచి కోటపల్లి మీదుగా రోడ్డు సౌకర్యం గత ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పట్టించుకోకపోవడంతో నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. నాయకులు పున్నంచంద్, నాగేశ్వర్ రావు, వెంకన్న, శ్యాంసుందర్, మహేశ్, బలరాం, సాయి పాల్గొన్నారు.

ఒకరిపై బైండ్‌డౌన్ కేసు

భీమిని: కన్నెపల్లి పోలీసుస్టేషన్‌లో బైండోవర్ ఉల్లంఘించిన కేసులో నిందితుడు సుంకరి తిరుపతిని తహసీల్దార్ ఎదుట శ్రవణ్‌కుమార్ శుక్రవారం పోలీసులు బైండ్‌డౌన్ చేశారు. ముత్తపూర్ గ్రామానికి చెందిన తిరుపతి అదేగ్రామానికి చెందిన ఓ వ్యక్తితో గొడవపడి బైండోవర్ ఉల్లంఘించడంతో కేసు నమోదైంది. బైండోవర్ ఉల్లంఘించినందుకుగాను రూ.2 లక్షలను వారంలో చెల్లించాలని తహసీల్దార్ ఆదేశించారు.

రైతుభరోసా లబ్ధిదారుల ఎంపిక సర్వే



సబ్బెపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతుభరోసా కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఎంపిక సర్వే శుక్రవారం హాజీపూర్ మండలంలో ప్రారంభమైంది. సబ్బెపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు భూములను పరిశీలించి సర్వే చేశారు. రైతుభరోసా కింద రూ.12 వేల పెట్టుబడి సాయం అందించేందుకుగాను సాగుభూముల గుర్తింపు కోసం క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఏవో కృష్ణ, గిర్దావర్ ప్రభు, ఏఈవో ప్రసన్న పాల్గొన్నారు.

కాసిపేట: గ్రామాల్లో రైతుభరోసాపై అధికారులు సర్వే చేపట్టారు. లబ్ధిదారుల వద్దకు, పొలాల్లోకి వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జన్నారం మండలం చింతగూడ పంచాయతీలోని పాపమ్మగూడలోని సర్వే నంబర్ 81/1లోని 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో జాయింట్ సర్వే నిర్వహించి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆర్డీవో శ్రీనివాసరావును శుక్రవారం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపమ్మగూడలోని ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని 20 ఏళ్లుగా అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో జాయింట్ సర్వే నిర్వహిస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పురంశెట్టి బాపు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి సాజిద్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సికిందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

చెన్నూర్: వైద్యసిబ్బంది స్థానికంగా ఉంటూ విధులు నిర్వహించాలని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సెలవులపై వెళ్లిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సూపరింటెండెంట్ అనుమతి లేకుండా సిబ్బంది సెలవులపై వెళ్లవద్దన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చిన రోగులకు సరైన సౌకర్యాలు కల్పించి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. చాలామంది స్థానికంగా ఉండడం లేదని నా దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ స్థానికంగా ఉండాలని సూచించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. అంగ్రాజుపల్లి, వేమనపల్లి, కోటపల్లి మండలాలకు చెందిన గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేలా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ, హెచ్‌ఈవో జగదీశ్, సబ్ యూనిట్ అధికారి వెంకటసాయి, పుట్ట సత్తయ్య ఉన్నారు.

‘ఇందిరమ్మ’ గుర్తింపు సర్వే



సర్వేలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారుల గుర్తింపు సర్వే పూర్తయినట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని 11వ వార్డులో సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 95 శాతం సర్వే పూర్తయిందన్నారు. మరో 5 శాతం మందిలో మృతి చెందినవారితోపాటు వలస వచ్చిన వారు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈమేరకు జిల్లా కలెక్టర్‌కు నివేదించినట్లు పేర్కొన్నారు. ర్యాండమ్ సూపర్ చెకింగ్ సర్వేలో పాల్గొనామని వివరించారు. వార్డు ఆఫీసర్ మల్లక్క, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్లు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న బీసీ నాయకులు

పాతమంచిర్యాల: బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలు కేవలం 11 శాతం మాత్రమే ఉన్నారని నివేదికలు చెబుతున్నాయన్నారు. కేంద్రంలోని 54 లక్షల ఉద్యోగాల్లో కేవలం 42.62 లక్షలు బీసీ ఉద్యోగులు ఉన్నారన్నారు. బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్లతో పదోన్నతులు కల్పిస్తే తప్ప బీసీలకు న్యాయం జరుగదన్నారు. భీంసేన్, మాడిశెట్టి వెంకట్, బోరే రాజయ్య పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో గ్రామసభలు

కాసిపేట: ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులపై లబ్ధిదారుల ఎంపికకు ఈనెల 21, 22 తేదీల్లో గ్రామసభలు ఉంటాయని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. 21న ఉదయం 10 గంటలకు బుగ్గగూడ, కోనూరు, లంబాడితండా(డి), లంబాడితండా(కె), సోమగూడెం (కె), రొట్టెపల్లి పంచాయతీలు, ఉదయం 11 గంటలకు చిన్నధర్మారం, కొండాపూర్, మామిడిగూడ, పెద్దనపల్లి, మధ్యాహ్నం 12 గంటలకు గట్రావుపల్లిలో గ్రామసభలు ఉంటాయని పేర్కొన్నారు. 22న ఉదయం 10 గంటలకు దేవాపూర్, కాసిపేట, కోమటిచేను, మల్కేపల్లి, పల్లంగూడ, తాటిగూడ, ఉదయం 11 గంటలకు ధర్మరావుపేట, ముత్యంపల్లి, సోనాపూర్, వెంకటపూర్ 12 గంటలకు మద్దిమాడలో గ్రామసభలు ఉంటాయని వివరించారు.

■ బొగ్గుబాయి వార్తలు

గైర్హాజరు లేకుండా పనిచేయాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తి, రక్షణలో కీలకంగా వ్యవహరించే మైనింగ్ సూపర్‌వైజర్లు గైర్హాజరు లేకుండా పనిచేయాలని ఎస్‌ఆర్పీ గ్రూప్ ఏజెంట్ చిప్ప వెంకటేశ్వర్లు తెలిపారు. సంవత్సరంలో 150 మస్టర్ల కంటే తక్కువ డ్యూటీలు చేసిన మైనింగ్ సూపర్‌వైజర్లకు శుక్రవారం గని మేనేజర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ఏజెంట్ వెంకటేశ్వర్లతోపాటు మేనేజర్ వెంకట్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏజెంట్ మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలతో డ్యూటీలకు ఎగనామం పెట్టొద్దన్నారు. గైర్హాజరు వల్ల ఉద్యోగులకే కాకుండా బొగ్గు ఉత్పత్తికి ప్రభావం పడుతుందన్నారు. ఆర్థికంగా కూడా కంపెనీకి నష్టం చేకూరుతుందన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన..

ఈ సందర్భంగా మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ గని ఉద్యోగులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. గనిపై జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ నియమాలను వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పనిసరని, రాంగ్ పార్కింగ్ చేయొద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమోషన్ పత్రాలు అందజేత..

గనిలో ప్రమోషన్ పొందిన 15 మంది ఉద్యోగులకు ప్రమోషన్ పత్రాలు అందజేశారు. ఉద్యోగులు అంకితభావంతో రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని అధికారులు సూచించారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ మురళీచౌదరి, గని రక్షణ అధికారి మహేందర్, సంక్షేమ అధికారి సాధన్ పాల్గొన్నారు.

ఆదాయపన్ను మాఫీకి కృషి



కార్మికులతో మాట్లాడుతున్నశంకర్‌రావు

శ్రీరాంపూర్: కార్మికుల ఆదాయపన్ను మాఫీకి కృషి చేస్తామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. శుక్రవారం ఆ యూనియన్ నాయకులు ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికుల చిరకాల వాంఛ అయిన సొంతింటి కల నెరవేర్చుతామన్నారు. తమ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో కార్మికులకు ఎన్నికల ముందు తామిచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. గనిలో కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు యజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని తెలిపారు. యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు శ్యామ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

19న బీసీ ఉద్యోగుల మహాసభ

శ్రీరాంపూర్: ఈనెల 19న బీసీ ఉద్యోగుల మహాసభ నిర్వహించనున్నట్లు సింగరేణి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ముస్కె సమ్మయ్య, బరుపటి మారుతి, బద్రి బుచ్చయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సీసీసీలోని ఎస్సీఓఏ క్లబ్‌లో ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా బీసీ సంఘాల రాష్ట్ర నాయకులు పంచాల శ్రీనివాస్, ఏ.నాగేశ్వర్ రావు, చీఫ్ లైజన్ అధికారి హరిశంకర్‌రావు హాజరవుతారని తెలిపారు. బీసీ ఉద్యోగులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

మంచిర్యాల ప్రీమియర్ లీగ్ విజేతకు అభినందనలు



క్రికెట్ విజేతలతో కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల ప్రీమియర్ లీగ్ విజేతగా నిలిచిన గుడిపేట టైటాన్ జట్టులోని బెటాలియన్ సిబ్బందిని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు శుక్రవారం అభినందించారు. జిల్లాలోని శివాజీ మైదానంలో నిర్వహించిన మంచిర్యాల ప్రీమియర్ లీగ్‌లో జిల్లా వ్యాప్తంగా పలు క్రికెట్ జట్లు పాల్గొనగా గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుడిపేట టైటాన్స్ జట్టు విజేతగా నిలిచి రూ.లక్ష నగదు పారితోషికంతోపాటు ట్రోఫీని అందుకుంది. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది గుడిపేట టైటాన్స్ జట్టు సభ్యులకు అభినందనలు తెలిపారు.

19న పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనం

బెల్లంపల్లి: బెల్లంపల్లి సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో 1974–75 బ్యాచ్ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ కన్వీనర్ పట్టి రవి కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు జరిగే సమ్మేళనానికి పూర్వ విద్యార్థులు హాజరుకావాలని కోరారు. వివరాలకు సెల్ 9603602121 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో నాల్గవ తరగతి ఉద్యోగి రాజం మృతితో ఆయన కుటుంబానికి బెటాలియన్ సిబ్బంది అండగా నిలిచారు. గత 20 ఏళ్లుగా రాజం నాల్గవ తరగతి ఉద్యోగిగా పని చేస్తూ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందాడు. సిబ్బంది మానవతా దృక్పథంతో స్పందించి రూ.45,900ల సేకరించారు. బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు ఈ నగదును శుక్రవారం రాజం భార్య సరోజకు అందజేశారు. అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.



బాధితురాలికి నగదు అందిస్తున్న తహసీల్దార్

సాయం అందజేత

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడవ జోన్‌కు చెందిన జంగంపల్లి పద్మ కొన్నేళ్లుగా కీళ్లవాతం వ్యాధితో ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న స్థానిక టీం పంచముఖి సొసైటీ సభ్యులు రూ.1,01,200 నగదు సేకరించారు. తహసీల్దార్ సతీశ్‌కుమార్‌తో శుక్రవారం బాధిత మహిళకు ఈ నగదు అందించారు. సొసైటీ సభ్యులు, ఆలయ అర్చకులు ఉన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



జట్టుకు ట్రోఫీ ఇస్తున్న మాజీ జెడ్పీటీసీ, ఎంఈవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాదలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. 32 జట్లు పాల్గొనగా లంబడిపల్లి జట్టు మొదటి స్థానం, కోటపల్లి జట్టు రెండో స్థానం, మంచిర్యాల జట్టు మూడోస్థానం, ఆస్నాద జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతిగా ట్రోఫీతోపాటు రూ.10వేల నగదు, ద్వితీయబహుమతి రూ.7వేలు, మూడోబహుమతి రూ.4వేలు, నాలుగో బహుమతిగా రూ.2వేల నగదు, కప్‌లు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ కరుణసాగర్ రావు, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్, పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి..



స్కాన్ చేస్తున్న ఫిర్యాదుదారుడు నవీన్

మంచిర్యాలక్రైం: పోలీసుల పనితీరు, సేవల్లో లోపాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు తెచ్చిన క్యూఆర్ కోడ్ విధానం సత్ఫలితాలిస్తోంది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా వారం వ్యవధిలో సుమారు 25 మంది ఫీడ్ బ్యాక్ ఇచ్చినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని అమ్మగార్డెన్ ప్రాంతానికి చెందిన నవీన్ శుక్రవారం మంచిర్యాల పోలీసుస్టేషన్‌కు వచ్చాడు. ఆయన ఫిర్యాదుకు పోలీసులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఫిర్యాదుదారుడు వెంటనే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పోలీసుల పని తీరును ప్రశంసిస్తూ తన అభిప్రాయాన్ని తెలిపాడు.

ఆర్టీఏ సభ్యుడిగా శ్రీనివాస్



సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన అంకతి శ్రీనివాస్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఆర్టీఏ) సభ్యునిగా నియామకం అయ్యారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ నివాసంలో ఎమ్మెల్యే ఆయనను శాలువాతో సన్మానించి నియామక పత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీలో మండల మాజీ యువజన అధ్యక్షుడిగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసినందుకు అవకాశం లభించిందని తెలిపారు.